## క్లుప్తంగా

### ప్రకాశం కాలనీలో కార్డెన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కోట: విద్యానగర్ ప్రకాశంకాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రకాశంకాలనీ సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఇక్కడ బయట వ్యక్తులు ఎక్కువగా నివసిస్తుంటారు. ఈ క్రమంలో వాకాడు సర్కిల్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్‌ఐలు పవన్, నాగబాబు, బలరామయ్య తమ సిబ్బందితో కలిసి ఆదివారం తెల్లవారుజామున కాలనీని జల్లెడ పట్టారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల ఆధార్ కార్డులను పరిశీలించారు. ఎటువంటి రికార్డులు లేని ఆరు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### దివ్యాంగులకు కూరగాయలు అందజేత



కూరగాయలు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పరిసర ప్రాంతాల్లో ఉండే దివ్యాంగులకు ఆదివారం జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు వీఎస్‌ఆర్ స్కూల్ అధినేత నంది మండలం బాలక్రిష్ణంరాజు సహకారంతో కూరగాయలు అందజేశారు. జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సంస్థ ద్వారా పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూఢ నమ్మకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు దాతలు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ ప్రతినిధులు నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, మురళీసింగ్, జగదీష్, సురేష్, సాయికిరణ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

### కాలువలో పూడికతీత



కాలువ పూడికతీత పనులు చేస్తున్న జేసీబీ

కోట: కోట బజారువీధిలో ఉన్న కాలువలో పూడికతీత పనులను సర్పంచ్ వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా చేస్తున్నారు. మురుగునీరు వెళ్లేందుకు గత 25 ఏళ్ల క్రితం కాలువను నిర్మించారు. బజారులోని వ్యాపారులు నిర్మాణాలు చేపట్టడంతో కాలువ పూడిపోయింది. వర్షపు నీరు రోడ్డు పైనే నిలిచిపోతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బజారువీధి నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు కాలువపై ఆక్రమణలను తొలగించి పూడికతీత పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

### 31న పెంచలకోనలో దీపావళి వేడుకలు

రాపూరు: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో 31వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా పెంచలకోనలో రథోత్సవం, ఆర్టీసీ బస్టాండు వద్ద నరకాసుర వధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మి అమ్మవార్లలను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి, సత్యభామగా అలంకరించి రథంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం, నరకాసుని వధ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

### ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు : తీరప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టారు. ఆలయం బయట ఉన్న త్రిశూలం వద్ద మొక్కులు చెల్లించి వేపాకు మండలు, వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈవో నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ పాల్గొన్నారు.

### బైక్ ఇవ్వలేదని కత్తితో దాడి



గాయపడిన వంశీ

గూడూరు రూరల్ : గూడూరు మున్సిపాలిటీలోని చెన్నూరులో ఆదివారం రాత్రి బైక్ ఇవ్వలేదని యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వంశీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతను బైక్‌పై గూడూరు నుంచి చెన్నూరు వెళుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన రాజా అడ్డు పడి బైక్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో వంశీ తాను ఇంటికి వెళ్లాలని చెప్పినా వినలేదు. కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు గూడూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని గూడూరు రూరల్ పోలీసులు తెలిపారు. రాజాపై పలు కేసులు నమోదైనట్టు సమాచారం.

అర్ధమాల, జీలపాటూరు గ్రామాల్లో వీధుల వెంబడి ఉన్న పేడదిబ్బలు




# అపరిశుభ్రత తాండవం

- దోమల వ్యాప్తితో విష జ్వరాలు

పెళ్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో మురుగు నిల్వలు అధికంగా పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువై విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపునీరు నివాసాల మధ్య చేరడంతో దోమల బెడద ఎక్కువైంది. మండల పరిధిలోని అర్ధమాల, చవటకండ్రిగ, జీలపాటూరు, పాలచ్చూరు, చెంబేడు, పునబాక, శిరసనంబేడు తదితర గ్రామాల్లో నివాసాల మధ్య మురుగు నిల్వలు ఎక్కువగా వున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వీధుల్లోని గుంతల్లో నీరు చేరడం, చెత్తాచెదారాలతో కుళ్లిన దుర్వాసన వెలువడుతోంది. దీంతో దోమలవ్యాప్తి ఎక్కువై ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోని మురుగు కాలువలు మరమ్మతులకు గురికావడంతో మురుగునీరంతా వీధుల్లోకి చేరుతోంది. అర్ధమాల, పుల్లూరు, దిరసనమాల గ్రామాలలో జనావాసాల మధ్య పేడదిబ్బలు పోగు కావడంతో దుర్వాసనతో స్థానికులు ముక్కులు మూసుకుంటున్నారు. ప్రధాన వీధులు కూడా సక్రమంగా లేకపోవడంతో తేలికపాటి వర్షానికి వీధులన్నీ రొచ్చురొచ్చుగా మారాయి. మురుగుకాల్వలు మరమ్మతులకు గురికావడంతో మురుగునీరంతా వీధుల్లోకి చేరుతోంది. పాలచ్చూరు, చెంబేడు, చవటకండ్రిగ గ్రామాల్లో వీధుల్లోని గుంతల్లో వర్షపు నీరు చేరికతో కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. శిరసనంబేడు, పునబాక గ్రామాల్లో నివాస ప్రాంతాల మధ్య మురుగు గుంతలు ఉండడంతో వర్షపునీటికి చెత్తాచెదారం చేరి దోమలు వ్యాప్తి అధికమైంది. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు.



జీలపాటూరు దళితవాడ సమీపంలో ఉన్న మురుగుగుంత

**నామమాత్రపు చర్యలు**

ప్రతి పంచాయతీకి పారిశుధ్య నిధులు మంజూరవుతున్నా పనులు మాత్రం నామమాత్రంగా చేపట్టారు. దీంతో గ్రామాల్లో మురుగు నిల్వలు ఎక్కువగా ఉంటున్నాయి. మండలంలోని చెంబేడు, పెళ్లకూరు పీహెచ్‌సీల పరిధిలోని అన్నీ పంచాయతీలకు వేటా రెండు పర్యాయాలు హెచ్‌డీఎఫ్ నిధులు మంజూరవుతున్నాయి. పారిశుధ్య పనుల కోసం ప్రణాళికా నిధులు మంజూరవుతున్నాయి. అయితే ఇక్కడి అధికారులు నామమాత్రపు పనులతో సరిపెట్టడంతో గ్రామాల్లో మురుగు నిల్వలు ఎక్కువైనట్లు తెలుస్తుంది. కనీసం ఏడాదికి ఒక్కసారి కూడా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం లేదని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గ్రామస్థాయి వైద్య సిబ్బంది పర్యవేక్షణ కుంటుబడడంతో వ్యాధిగ్రస్తులు జ్వరాలతో పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చవటకండ్రిగలో వీధుల్లో చేరిన వర్షపునీరు

# రేపు పోలేరమ్మ జాతర ప్రారంభం

- వైభవంగా ఘటోత్సవం

సైదాపురం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన సైదాపురం పోలేరమ్మ జాతరను ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఘటోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. 5 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న జాతరలో పోలేరమ్మను దర్శించుకునేందుకు ఇప్పటి నుంచే సందడి నెలకొంది. వెంకటగిరి పోలేరమ్మ జాతర ముగిసిన నెల రోజుల తర్వాత సైదాపురంలో జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని కారణాల వల్ల 2002లో జాతర నిర్వహించారు. తర్వాత 2016లో చేపట్టారు. 2019 తర్వాత 2024లో ఇప్పడు జాతర చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. బుధ, గురువారం సాయంత్రం వరకు భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తారు. అనంతరం కులాల వారిగా నైవేద్యం సమర్పిస్తారు. గ్రామంలో ఉన్న 6 కులాల వారు విడతలవారీగా మేళతాళాలతో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తారు. పొలి కార్యక్రమం పూర్తయిన వెంటనే పోలేరమ్మ ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఊరేగింపు తూర్పువీధి చివరకు చేరుకోగానే అమ్మవారి కళ్లు, చేతులను తొలగిస్తారు. పోలేరమ్మ విగ్రహం మట్టిని పొందేందుకు భక్తులు పోటీ పడతారు. ఈ మట్టిని ఇంటిలో ఉంచుకుంటే శుభ్రం జరుగుతుందని భక్తుల్లో నమ్మకం.



పోలేరమ్మ (ఫైల్)



అమ్మవారి విగ్రహం

**కులాల చందాలతో జాతర...**

సైదాపురంలో ఉన్న రెడ్డి, బలిజ, యాదవ, శెట్టి, బెస్త, గాండ్ల కులాలకు చెందిన వారు చందాలు వేసుకుని జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ప్రతి కులానికీ చెందిన వారంతా రూ.1.60 లక్షల చొప్పున చందాలు వేసుకున్నారు. కులానికి నలుగురు పెద్దలుగా నిర్ణయిస్తారు. వారి ఆధ్వర్యంలోనే జాతర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. గ్రామ పెద్దలతో పాటు వీఆర్వో రమాదేవి పర్యవేక్షణలో జాతరను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

# ఆర్భాటంగా పల్లె పండుగ

చిల్లకూరు : కూటమి నేతలు పల్లె పండుగ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటిన సందర్భంగా పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో ఉపాధి నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ పనుల కోసం చిల్లకూరు మండలంలో రూ.2 కోట్లు విడుదల చేసింది. ప్రతి గ్రామానికీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కేటాయించింది. ఈ పనులు ప్రారంభించే ముందు స్థానిక ప్రజా ప్రతినిధిని ఆహ్వానించి పెద్ద ఎత్తున పండుగ చేయాలని ఆదేశించింది. ఇందుకుగాను శిలాఫలకంలో పెద్ద ఫొటో వేయాలని, ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. వీటికి సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుండడంతో మిగిలిని రూ.4 లక్షలతో ఏమి పనులు చేస్తారని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లకు శంకుస్థాన చేయనున్నారు.



శిలాఫలకంలో ప్రజా ప్రతినిధి ఫొటో

# ఘనంగా సామూహిక పొంగళ్లు

సైదాపురం : మండలంలోని రాగన మారాపురం గ్రామ దేవతలు అంకమ్మ, మహాలక్ష్మమ్మ, చెంగాలమ్మకు ఆదివారం గ్రామస్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా తిచ్చకార్తె 3వ ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది పొంగళ్లతోపాటు వడపప్పు, బెల్లంను అమ్మవార్లకు సమర్పించారు. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం గ్రామానికి చేరుకోవడంతో సందడిగా మారింది.



సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

# రేపటి నుంచి భూ సమస్యపై గ్రామసభలు

చిల్లకూరు : గతంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో మంగళవారం నుంచి నవంబర్ 8వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ గ్రామసభలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22న ఇప్పపూడి, 23న అద్దెపల్లి, 24న తొణుకుమాల, 25న బల్లవోలు, 26న వల్లిపేడు, 29న తూర్పుకనుపూరు, 30న పల్లమాల కండ్రిగ, నవంబర్ 1న పల్లమాల, 2న అన్నంబాక, 5న కలవకొండ, 6న పెంటపాడు, 7న తీపనూరు, 8న యోగీశ్వరినిపల్లిలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### దాడులపై పోలీసుల విచారణ

కోట: మండలంలోని ఉత్తమనెల్లూరులో ఆదివారం గ్రామ పొంగళ్లు జరుగుతున్న సమయంలో ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో హేమంత్ అనే యువకుడు కత్తితో దాడి చేయడంతో ప్రసాద్ అనే యువకుడు గాయపడ్డాడు. అతడిని స్థానికులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

### 2 నుంచి సుబ్రమణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధి పాత శివాలయం వద్ద ఉన్న వల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి స్కంధషష్టి బ్రహ్మోత్సవాలను నవంబరు 2 తేదీ నుంచి వారం రోజులు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్కంధషష్టి ఉత్సవాల్లో ప్రతి రోజూ ప్రత్యేక పూజలతోపాటు స్వామి వారి నగరోత్సవం ఉంటుందన్నారు. తారకాసుర సంహార ఘట్టాన్ని 7 తేదీ రాత్రి నిర్వహిస్తామన్నారు. 8న దేవసేన, షణ్ముగ స్వామివార్ల కల్యాణోత్సవం, 9న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

### అంకమ్మకు ప్రత్యేక పూజలు



రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, పూలంగి సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలనీలాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టారు.

### కండలేరులో 36.356 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరులో ఆదివారం నాటికి 36.356 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. జలాశయంలోకి వరద కాలువ నుంచి 400, సోమశిల నుంచి 9,500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్య సాయిగంగ కాలువకు 140, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

# మాజీ సమితి అధ్యక్షుడికి కాకాణి నివాళి



రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాపూరు : రాపూరు మాజీ సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పాపకన్ను రాజశేఖరరెడ్డి (81) మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం నెల్లూరులో రాజశేఖరరెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. రాజశేఖరరెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**నేడు అంత్యక్రియలు**

పాపకన్ను రాజశేఖరరెడ్డి మృతదేహాన్ని సోమవారం వేపనాపికి తీసుకురానున్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆయన బావ, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆదివారం వేపినాపి గ్రామానికి చేరుకుని అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నాయకులు రమణారెడ్డి, గణేష్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.



రాపూరు -వేపినాపిలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి

# చెరువు కలుజు ధ్వంసం

- వృథాగా పోతున్న నీరు
- ఆయకట్టు రైతులు ఆందోళన

చిల్లకూరు : మండలంలోని బల్లవోలు పంచాయతీ కోవూరివారిపాళెంలో ఉన్న బాపన చెరువు కలుజును కొంతమంది రాత్రికిరాత్రే ధ్వంసం చేయడంతో నీరు వృథాగా పోతోంది. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు బాపన చెరువులోకి నీరు చేరింది. పంటలు పండించుకోవచ్చని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. నీరు ఎక్కువగా ఉండడం వల్ల చెరువు లోపల ఉన్న భూముల్లో సాగు చేయడానికి వీలు కాని పరిస్థితి. ఈ క్రమంలో అక్కడి భూములు ఉన్న రైతులు కొంతమంది రాత్రికి రాత్రే కలుజును ధ్వంసం చేశారు. దీంతో రెండు రోజులుగా చెరువు నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని నీటి పారుదల శాఖ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ ఫరూఖ్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతంలోని చెరువుల పర్యవేక్షణ బాధ్యత తన కిందకు రాదని, కొత్తగా వచ్చిన ఏఈకి సమాచారం ఇస్తామని తెలిపారు. చెరువులోని నీరు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి చివరి తడుల వరకు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కలుజును ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న నీరు

# వైద్య శిబిరాలకు విశేష స్పందన



రక్త నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిల్లకూరు : తమ్మినపట్నం పంచాయతీ గుమ్మళ్లదిబ్బలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జిందాల్ పవర్ ప్రాజెక్టు(సింహపురి) యూనిట్ అధినేత షాలు జిందాల్ పుట్టిన రోజును పురస్కరించుకుని పరిశ్రమ ప్రతినిధులు వైద్య శిబిరం నిర్వహించారు. పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో సుమారు 60 మందికి పైగా పలు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఓఎమ్ హెడ్ దిలీప్ పాతక్, ఖలీద్, మ్యాథ్యూ, శివాజీ, లీలా పాల్గొన్నారు.

**నాయుడుపేటలో..**

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జరనల్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం వద్ద ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. సుమారు 130 మందికి పైగా పరీక్షలు చేసుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేసినట్టు ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరీ శంకర్, సీఈవో సీతారామనాయుడు తెలిపారు. 32 మందికి కంటి అద్దాలు, 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా జాతీయ రహదారి పనులు

- పంట కాలువలు, నడకదారులు పూడ్చివేత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు జరుగుతున్న 71 నంబరు జాతీయ రహదారి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. పంట కాలువలు, నడక దారులను పూడ్చేస్తున్నారని నాయుడుపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెందోటి పార్థసారధి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నాయుడుపేట పట్టణ పరిధిలో వెలుతున్న జాతీయ రహదారిలో సర్వే నంబరు 109లోని ఎల్‌పీ సాగరం పెద్ద చెరువు, సర్వే నంబరు 140లోని అన్నా చెరువు, సర్వే నంబరు 161లో ఉన్న రాఘవరెడ్డి చెరువుకు సంబంధించిన పంట కాలువలు ఉన్నాయని తెలిపారు. వాటిని పూడ్చివేశారని, ఏడు గ్రామాల రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్న దారిని సైతం లేకుండా పనులు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, అధికారులు, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు సైతం విన్నవించినట్టు తెలిపారు. అధికారులు స్పందించి రైతులతో పాటు అనేక గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.



వెందోటి పార్థసారథిరెడ్డి

# అడుగుకో గుంత

**ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పలురోడ్లు దెబ్బతిన్నాయి. అడుగుకో గుంత పడింది. వాటిలో నీరు నిలిచింది. వాహనదారులు గుంతల్లో పడి గాయాల పాల వుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.**

దొరవారిసత్రం : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని జాతీయ రహదారిపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కలగుంట గ్రామ సమీపంలోని ఫ్లెట్టైవర్ బ్రిడ్జిపైన, అక్కరపాక, పోలిరెడ్డిపాళెం గ్రామాల సమీపంలో రోడ్డుపై తారు లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు రాత్రుళ్లు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

**ప్రధాన రహదారిపై నరకయాతన**

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని పాత ట్రెజరీ వీధిలో ప్రధాన రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఇక్కడ ప్రయివేటు సంస్థ ప్రతినిధులు గ్యాస్ పైపుల కోసం పెద్ద ఎత్తున కాలువలు తవ్వి సక్రమంగా పూడ్చకపోవడంతో గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురద మయంగా మారడంతోపాటు గుంతల్లో నీరు నిలుస్తుండడంతో వాహనాలు ఇర్కుక్కుపోతున్నాయి. అదేవిధంగా మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.



దొరవారిసత్రం చిలమానుచేను సమీపంలో రోడ్డు దుస్థితి

అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**అధ్వానంగా ఓజిలి-గొల్లపల్లి రోడ్డు**

ఓజిలి: ఓజిలి –గొల్లపల్లి రోడ్డు అధ్వానంగా ఉంది. మండలంలోని పెదపరియ, గుర్రంకొండ, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, బాలాయపల్లి మండలంలోని జయింపు మీదుగా గొల్లపల్లి వరకు 33 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు ద్వారా ప్రతి నిత్యమూ గూడూరు, వెంకటగిరి, బాలాయపల్లి పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అడుగుకో గుంత పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

**సైదాపురంలో..**

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం నుంచి ఊటుకూరు వెళ్లే రోడ్డులో అడుగుకో గుంత పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలివడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లడానికి సుమారు అరగంటకు పైనే పడుతోంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నాయుడుపేటలో పాత ట్రెజరీ వీధిలో..



నాయుడుపేటలోని ప్రధాన రోడ్డు



సైదాపురం - ఊటుకూరు రోడ్డు..